# జై వీరభద్రా

—లల్లాదేవి



"ఆర్య రాజా! ఆగాగు!!

యమునా తీర నివాసులయిన ఆంధ్ర వీరులను జయించినావు. కాశ, కరూశ, వత్స దేశాలు నీకు వశమయినాయి. ఆంధ్ర ధులను జయించి ఆంధ్ర (జి) విష్ణువు అన్న కీర్తి నామాన్ని ధరించినావు.

*సాధురే రాజా! సాధుసాధు!!*

*కాని నీవొక విషయాన్ని మరచినావోయీ!*

*ఆంధ్రులు ఉత్తరాపథానికే పరిమితమయి ఉన్నారనుకున్నావా? వారు ఇప్పటికే వింధ్యను దాటి మహానది రుషికుల్య తెలివాహ గౌతమీనదులను కూడా దాటి కృష్ణా తీరం వరకు నివాసాలను ఏర్పరచుకున్నారు.*

దక్షిణాపథానవారు నాగ, యక్ష, శాబర, పుండ్ర, పుళింద జాతుల వారితో వెయ్యాన్నీ, వియ్యాన్నీ కలుపుకుని అజేయ గణాలుగా రూపొందినారోయీ!

వారిని జయించనిదే ఆంధ్ర (జి) విష్ణువు అన్న కీర్తి బిరుదానికి నీవు అర్హుడవుకావు అన్నదామె.

ముందుకు సాగుతున్న ఆంధ్ర విష్ణువు చరణ రాజీవాలు వెనుదిరిగినాయి. ముఖం ప్రశ్నార్థకంగా అయింది.

రవ్వమీసం దువ్వి, సువిశాల ఆకర్ణాంత నేత్రాలతో ఆమె వంకకు ఓరగా, కోరగా చూచినాడు. చిరు మందహాసం చేశాడు.

ఎత్తయిన మదురు, ఎత్తయిన నాసిక, రాగి వర్ణంలో అతని శరీర కాంతి ధగధగలాడుతోంది.

అమృత వారాసీ! అపురూప రూపసీ! ఔనా ప్రేయసీ! ఏమంటివి? ఏమంటివి?

ఆంధ్ర రాజులను జయించి ధరించిన ఆంధ్ర విష్ణువు అన్న కీర్తి నామానికి అనర్హుడనా నేను? ఇన్నాళ్ళకిన్నాళ్ళకు నా శక్తి సంపత్తులను శంకించుచున్నావా ఏమి?

ఓ! సుకుమారీ! సుందర పయోధరీ! రసమాధురీ! అమృతాన్ని అందించవలసిన నీ అధరాలు ఈనాడు ఆంధ్రుల వీర చరిత్రలను వర్ణించుచున్నవేమి?

శాతోదరీ! నా బాహువల్లరిలో చిక్కి నా శక్తి సంపన్నతను రుచిమాచిన ముద్దరాలివి కదా!

ఈ బాహు దండాలెంత బలీయమైనవో నీవెరుగవా? దక్షిణాపథాన మూడు సముద్రాల మధ్య పరుచుకున్న ఆంధ్ర గణాలను అవలీలగా జయిస్తాను. వారి కిరీట



ఆయుధపూజ — కె.పి.ఎ. స్వామి

కాంతులు నా కాలికొనగోటిలో ప్రతిఫలించేలా చేస్తాను. ఎందుకే నీకింత వేగిరపాటు'' అంటూ వీరాలాపం చేశాడు ఆంధ్ర విష్ణువు. మాటాడుతున్నప్పుడు కదులుతున్న అతని అధరాల వంక ఆరాధనాభావంతో చూస్తోందామె.

కన్నులు తేట ఊట నీటిలో కదులాడే చేపపిల్లల్లావున్నాయి. కవ్విస్తున్నాయి. కాంతులను వెదజల్లుతున్నాయి. చిలిపి ఊహలు శరీరమంతా నింపుకున్న విధంగా కన్పిస్తోంది. ఆ చిలిపి తనమే ఆ ధీరుని సహాన్ని రెచ్చగొడుతోంది.

''ప్రియతమా! ఏమన్నావోయ్! ఆంధ్రులను అవలీలగా జయిస్తావా? ఈ ఉత్తరాదిన కాశ, కరూశ, వత్స, దేశాల ఆంధ్రులు నీముందు మోకరిల్లినారంటే అర్థముంది.

ఇక్కడ స్థానబలిమి కలవాడవు నీవు! కాని దక్షిణాపథంలో స్థానబలిమి నీది కాదు. వారిది. ఒకనాడు మధురా నగరంలో చాణూరుడు శ్రీకృష్ణుడు అంతటి వానినే ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానించాడుకదా!

కంస పక్షపాతి అయి, యశోదా కృష్ణుని ఎదిరించిన ఆ చాణూరుడు ఆంధ్రుడేనన్నమాట మరచినావా?

వాడి ఊసు నీకెందుకు? శక్తిశాలివి అయిన ఉత్తమ పురుషుడవు. నీవంటి పురుష పుంగవుని వియోగం నేను భరించలేను. నీవు నాకు కావాలి! నీవే నాకు కావాలి! దక్షిణాదికి యుద్ధ యాత్రలు విరమించుకో! శ్రీరామ చంద్రుని కాలం నించి వీరుడనిపించుకోవాలన్న కోరిక తీర్చుకునేందుకు దక్షిణాదికి యుద్ధ యాత్రలు చేయటం పరిపాటి అయింది మీకు. ఇదేమి ఉబలాటమయ్యా!? వారేమి చేశారు? వేట వ్యవసాయం వృత్తులుగా స్వీకరించి శాంతి జీవనం సాగిస్తున్నారు. పరాక్రమవంతుడు అన్న పేరు సంపాదించుకునేందుకు ఆ శాంత వీరులపై దండయాత్రలు చేయటం తగునా?'' అన్నదామె.

ఆంధ్ర విష్ణువు ఆకాంక్షగా ఆమె చేయి అందుకున్నాడు. కమల పత్రాలవంటి కరతలం ఆతని ముష్టిలో ఒరుసుకుపోతోంది.

''ఓసీ! సమనేత్ర! సుమగాత్ర! ఉద్ధతుడయిన నీ ప్రియుడు రసికతలేని వాడనుకున్నావా? నీకు కానివాడనుకున్నావా? దక్షిణాదికి వారాణువ (సేన)లను తరలించే వేళ రాణులను కూడా తరలిస్తాను. అక్కడ ఆంధ్రసేనలతో పోరాడే శుభ ముహూర్తాన నా వీర విక్రమాన్ని కనులారా చూచుకునే అవకాశం నీకు కల్పిస్తాను. విరహంతో చూడకు. అందుకోసం దిగులు పడకు'' అంటూ ఆమె పాణి పల్లవాన్ని నొక్కి వొదిలేశాడు.

** ** **

యమునా తీరాన సేనా వాహినులు సిద్ధమవుతున్నాయి. హుటాహుటిన ఆ చోటుని చేరుకున్నాడు ఆంధ్ర నాయకుడు. ఆర్య సేనలు అమితోత్సాహంతో కడలి తరంగాల్లా ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి.

నాయకునిది ప్రభుభక్తి! సేనా నాయకులది ఉత్సాహ శక్తి! అప్పటికే ఉత్తరాపథాన ఆర్య రాజులలో ఆంధ్ర విష్ణువు విజయ వార్తలు నాలుగు దిక్కులా చెప్పుకుని మురిసిపోతున్నారు. ఈశాన్య భూమిలో లలిత పట్నం నించి పశ్చిమాన మరుభూమి దాకా ఉత్తరాదిన తక్షశిల నుంచి దక్షిణాదిన ఉత్కళ దాకా సప్త సింధు మహా నదుల మధ్య ఆతని కీర్తి వెన్నెల పరుచుకుపోయింది. విజయకేతనాలు విజయః వీథుల్లో రెపరెపలాడుతున్నాయి. ఉత్తరాదికి మళ్ళీ చైతన్యం వచ్చింది.

''చమూపతులారా! వచ్చే మార్గ శీర్ష మాసం బహుళ త్రయోదశినాడు మన దక్షిణదేశ దిగ్విజయ యాత్రల సమారంభానికి సుముహూర్తం నిశ్చయించారు దైవజ్ఞులు. మీకున్న ఉత్సాహ శక్తి నాకు తెలియనిది కాదు. ఈ ఆంధ్ర విష్ణువు ప్రతిష్ఠ ఆర్య జనవాహినిలో నాలుగు మూలలనించి వినిపిస్తోంది. దానికి కారణం మీ శక్తి.

మీ పట్టుదల! రాజుల గొప్పతనం సేనానుల, సేనల శక్తిని విశ్వాసాన్ని ఆధారం చేసుకొని కదా వర్ధిల్లుతాయి.

అఖండ భరతఖండంలో ఆర్య దేశాలలో మగధ మహాశక్తివంతమయినది. ఆ తరువాత దక్షిణాపథాన ఆంధ్ర సామ్రాజ్యానిది రెండవ స్థానం అని అందరికీ తెలుసు.

ఆంధ్రజాతే పౌరుషం కల జాతి.

వారు సామాన్యులు కారయ్యా! విశ్వామిత్ర సంతతి. మధురలో శ్రీకృష్ణుని ఎదిరించినా, కురుక్షేత్రంలో అభిమాన ధనుడయిన దుర్యోధనుని వెన్ను తట్టి నిలిచినా వారంతా ఆంధ్రులే! యాజుషీయ మంత్రాలలో ఆంధ్ర పాఠం వుంది. వారు అంతటి చరిత్ర పురుషులు, మహిమాన్వితులు, శక్తి సంపన్నులు, ముక్కుసూటిగా పోయి ముఖాన్ని గోడకు గుద్దుకునేంతటి నిజాయితీపరులు.

నష్టాలకు భయపడి నమ్మిన సిద్ధాంతాలను వొదులుకోరు. మూడు సముద్రాల మధ్య పరుచుకుపోయి చాలా శక్తివంతమయిన నగరాలను వారు నిర్మించుకున్నారు. నదులు, కొండలు, అడవులవంటి ప్రకృతి సంపదలు


బీడుపడిన ప్రేమ రాహిత్యపు హృదయంపై - స్నేహమాధుర్యపు తొలకరిజల్లు పడితే - అది మలయమారుతమే అవుతుందా? పెను తుఫానుగా మారుతుందా? ప్రేమంటే ఏమిటి అన్న చింతనను పలు కోణాల నుంచి విశ్లేషించి యండమూరి వీరేంద్రనాథ్ థ్రిల్లింగ్‌గా చెప్పిన, సరికొత్త విశ్వజనీన ప్రేమ పాఠం!

ప్రచురణ: నవభారత్ బుక్ హౌస్, విజయవాడ-2

అన్ని బుక్ స్టాల్స్‌లోను లభించును.

థ్రిల్లర్

రూ. 20/-

అమేయంగా వారికున్నాయి. అంతేకాదు వేట, వ్యవసాయం వారి జీవన వృత్తులయినా, యుద్ధాలలో ఆరితేరిన యుద్ధ విద్యా విశారదులు వారు. అందమయిన విశాల మయిన శక్తి సంపన్నులయిన నగరాలెన్నింటినో వారు కట్టుకున్నారు. అవే వారికి రక్షా కవచం.

ప్రతిష్ఠాన పురము, ఫణిగిరి, గాజుల బండ, కొండాపురం, రామగిరి, విజయపురి వంటి ప్రాచీన మయిన నగరాలెన్నో వారికున్నాయి.

శ్రీశైలము, వజ్రాల దిన్నెవంటి పవిత్ర క్షేత్రాలున్నాయి. మోటుపల్లి, భీమునిపట్నం వంటి అతి ప్రాచీన ఓడరేవుపట్టణాలున్నాయి.

విదేశాలలో వ్యాపారాలున్నాయి.

గంగా నదికి సాటివచ్చే గోదావరి, యమునకు సాటి వచ్చే కృష్ణానది వారికున్నాయి.

అంతటి శక్తివంతమయిన మహిమాన్వితమయిన దక్షిణాంధ్ర మహా సామ్రాజ్యానికి ఏలిక నిశుంభుడు.

అతని పలుకుబడిలో నాగ, శబర, పుండ్ర, పులింద, ఆంధ్రజాతులు సమైక్యంగా మనుగడ సాగిస్తున్నాయి.

ఆంధ్రులవగా వీర్యవంతులయ్యా!

వీరిమీదికి మనం దండయాత్ర చెయ్యాలి. హిమాలయాలనించి వారాసి వరకు వున్న అఖండ భారతంలో రెండవ స్థానం ఆక్రమిస్తున్న ఆంధ్రులతో పోరు అంటే మాటలు కాదు. మన శక్తి నిరూపించుకునే సుముహూర్తం ఇది. మీరంతా ఆయుధాలకు పదును పెట్టండి. ఆంధ్ర మహా సామ్రాజ్య విధ్వంసానికి ఆరంభ గీతాలను ఆలపించండి'' అంటూ సేనానులను ఉత్తేజ పరచినాడు ఆంధ్ర విష్ణువు.

అతని సైనికులు పాడే వీర గీతాలు యమునా నది మీది తరంగాల్లా ప్రపంచంమీద పరుచుకుంటున్నాయి.

ఆ సమయంకోసం ఎదురు చూస్తున్నారు సైనికులు.

** ** **


సుముహూర్తం ఆసన్నమయింది.

విదర్భ, విదేహ, అవంతి, అంగ, వంగ, కాశ్మీర దేశాలనించి అతని శుభాన్ని కోరుతూ ఎన్నో కానుకలు వచ్చాయి. సైనికులను కూడా తోడుగా పంపించారు ఆర్య రాజులు. మన మహాసామ్రాజ్య వైభవానికి పోటీ రాగల మహా సామ్రాజ్యం ఎందుకుండాలి? అది పతనం కావాలి అన్నదే వారి ఆకాంక్ష. మాగధేయ మహా మండలాధీశ్వరుల బోలినవారు మరొక్కరుండరాదు. వారు దాక్షిణాత్యులు అసలే కాకూడదు.

శాపగ్రస్తులై దక్షిణాదికి వలస పోయిన వారికింత వైభవమా?

మగధనించి ఆంధ్ర విష్ణుకి అండగా ఎన్నో కానుకలు వచ్చాయి ఏనుగులమీద బంగారు సంచులు వచ్చాయి.

ఆడంబరంగా దండయాత్ర ఆరంభమయింది. వారు మహా నదిని దాటి రుషికుల్య, తెలివాహనదుల మీదుగా గౌతమీ తీరానికి చేరుకుంటున్నారు. దారిపొడవునా వంతెనలు నిర్మించారు. కొండల్ని తొలిచి మార్గాలు సుగమం చేశారు.




అడవుల్ని చెక్కి రావబాటలు నిర్మించుకున్నారు. ఆంధ్ర సామ్రాజ్యంఅల్లకల్లోలమయింది. గ్రామాలు తగలబడుతున్నాయి. సంపదలు దోపిడీకి గురవుతున్నాయి. స్త్రీలు సైనికుల వల్ల అవమానితలు అవుతున్నారు.

ఆంధ్ర విష్ణువు రాక సముద్రంలో పిడుగు పడి నట్లుగా అయింది. శబరులు (సవరలు) గుంపులు కట్టి పారిపోతున్నారు. ఆంధ్ర పౌరుషం పడగ త్రొక్కి సింహ నాదం చేశాడు ఆర్యుడు.

"ఆంధ్ర నాయకా! నిశుంభా! అంతా అయిపోయింది. ఆంధ్ర పౌరుషం చేజారిపోయే దుర్దినాలు ఆసన్నమయినాయి. ఆంధ్ర ప్రశస్తి సముద్ర జలాల్లో మునిగిపోతోంది.

మీరింకా శ్వేత గిరులలో నిద్రపోతున్నారు. ఆర్యుడొచ్చాడు! యమునా తీరవాసులయిన ఆంధ్ర రాజులను జయించటంవల్ల ఆంధ్ర విష్ణువు అయినాడట.

ఆంధ్రవిష్ణు అనే కీర్తినామాన్ని తగిలించుకున్నాడు. లాంగుల్య రుషి కుల్య, తెలివాహ నదులు అల్లకల్లోలమయినాయి. ఇప్పుడు గౌతమిలో పారుతున్నది వర్షపు నీరు కాదయ్యా, ఆంధ్రజాతుల కన్నీరు గోదారిలో పారుతున్నది!

పౌండ్రక పులిందులు తలలు వంచుకున్నారు. నాగులు, శబరులు పాదాక్రాంతులవుతున్నారు. మిగిలి వున్నది ఆంధ్ర వీరుడవు నీవు ఒక్కడవే! మేలుకోరా ఆంధ్ర నాయకా!

వీరభద్ర కరవాలాన్ని అందుకో! ఆంధ్ర జాతులను రక్షించుకో! నీ జాతి పౌరుషాన్ని నిరూపించుకో!'' అంటూ ఎలుగెత్తి ఏడ్చింది ఆంధ్రధ్వజ!

శ్వేత గిరులలో ఆవాసముంటున్న ఆంధ్ర నాయకుడు ఎత్తయిన, ఒత్తయిన కనుబొమ్మలు విల్లులా వంచాడు. వాటినుంచి వాడిచూపుల్ని తూపుల్లా విసురుతున్నాడు!

అతని ప్రతాపాగ్ని నెగడులా ప్రజ్వలించింది.

"ఏమేమీ! ఎవడు వాడు? ఆంధ్ర విష్ణువా? ఆంధ్ర జిష్ణువా? ఆంధ్రులను జయించి గౌరవ నామం ధరించినాడా! ఆంధ్ర పౌరుషం అనామకమయినదనుకున్నాడా? ఆంధ్ర ప్రశస్తి దుల్లిపోయింది అనుకున్నాడా? ఆంధ్ర వీరుల శరీరాలు సముద్ర జలాలపై తేలియాడిన నాడే అతనికి ఆంధ్ర రాజ్యం వశమవుతుంది. వీరులారా! వీరవనితలారా! వీరమాతలారా లేవండి! వీర పత్నులారా కత్తిపట్టండి! ఆంధ్రులారా! ఆవులించిన సింహాలై గర్జించండి! పంజా విప్పిన వ్యాఘ్రాలై గాండ్రించండి!

ఆంధ్ర పుత్రులారా! హరోం హర! కదలండి! హరోం హర! కత్తులు దూయండి! జై వీరభద్రా అంటూ ప్రమథగణాలై గర్జించండిరా! బానిస బ్రతుకు నీచ హేతువు! స్వాతంత్ర్య సమరాంగణ సింహాలై విప్లవించండి!'' అంటూ ఆంధ్ర వీరులకు, వీరనారులకు పిలుపు ఇచ్చాడు నిశుంభుడు.

ఆ పిలుపు అందుకున్న ఆంధ్రవీర విక్రమ సింహ రాచికాలు దిగ్గుమని లేచాయి! జూలు విదిల్చినాయి. పంజాలు విప్పినాయి!

నోరావులించి రక్తజిహ్వను, ధవళ దంతాలను ప్రదర్శించడం ప్రారంభించినాయి.

పడగ విప్పిన మహా నాగులై ఉఫ్ఫ్‌మని ఫూత్కారించినాయి.

అప్పటికి గోదావరి దాకా వచ్చి చేరాడు ఆంధ్ర విష్ణువు.

గం గల పారుతున్న గోదారిలో ఖడ్గాలకు అంటిన ఆంధ్ర రక్తాన్ని కడుగుతున్నారు ఉత్తరాది సైనికులు.

ఆంధ్ర సైనికులు ఆ ప్రాంతాలలో పొంచి వున్నారు. మంచి అవకాశంకోసం వారు వేచి చూస్తున్నారు.

"సైనికులారా! మీ రాజు ఆంధ్ర జిష్ణువా? ఉత్తరా పథం వదలి దక్షిణ భూమిలో రక్తపు ఏరులు పారించేందుకు వచ్చాడా?

మర్యాదగా ఈ చోటు వదలి వెళ్ళిపొమ్మని చెప్పండి. లేదంటే అతని శిరస్సు గోదారిలో, శరీరం కృష్ణలో కలిపేస్తామని చెప్పండి'' అంటూ కత్తులు దూశారు ఆంధ్ర సైనికులు.

ఆర్య సమూహాలు కొన్ని ప్రాణ భయంతో పరుగు తీశాయి.

"ఏమిరా ఏమయింది? ఏమిటా వేగిరపాటు? ఎందుకా వెరగుపాటు? మీ శరీరాలలో ఆ రక్తధారలకు కారణమేమి?" రాజు ప్రశ్నించాడు.


"రాజా! ఆంధ్ర విష్ణువు అన్న నామం నీకు విలువదయ్యా! ఎవడో నిశుంభుడట. ఆంధ్ర నాయకుడట! ప్రమథ నాథునిలా పరాక్రమించినాడు. ఆర్య రక్తంతో ఈ తెలుగు నేలలు అన్నీ తడిసి చిత్తడి అవుతున్నాయి. ఇంక తిరిగిపోవడమే దారి. ఇంక ముందుకు పోవాలంటే మనకున్న దారి గోదారి ఒక్కటే!" అంటూ ఖడ్గాలను గోదారిలోకి విసిరి కొట్టారు సైనికులు.

ఆంధ్ర విష్ణువు ఎత్తయిన నెన్నుదురు ముడుత పడింది. ఆతని కన్నులలో సుదర్శన చక్రాలు విస్ఫులింగాలను చిమ్ముతున్నాయి. ఊర్పులు దీర్ఘ తరంగ పాము బుసల్లా అయినాయి.

"ఏమేమీ! అంతకు తెగించినాడా నిశుంభుడు. ముందు శ్వేత గిరికి దారితీయండి. కనిపించిన ఆంధ్రు లందరినీ హతమార్చండి. నగరాల్ని దహించండి. జనావాసాలను నిర్జనంగా చేయండి.

సైనికులారా! నిశుంభుడు నివాసముండే రాచ నగరును నేలమట్టం చేసి ఆ చోటున జిల్లేడులు మొలిపించండి" అంటూ ఆదేశించాడు.

ఆంధ్ర మూకల ఆగడంలో విసిగి వేసారి నిరాశకు గురి అయిన ఆర్య రాజు సేనావాహినులు తిరిగి ఉత్సహించినాయి.




ఆయుధాలను పట్టి వారు దక్షిణ యాత్ర చాలించి తూర్పు ముఖంగా ప్రయాణమయినారు.

సముద్రానికి అతి చేరువలో శ్వేత గిరివి ఆనుకుని వున్నది నిశుంభుని రాజధాని. అప్పటికే ఆంధ్ర మహా సామ్రాజ్యాన్ని కాపాడదలచినవారంతా శ్వేతగిరులను చేరుకున్నారు.

ఫణిగిరి నుంచి నాగులంతా వచ్చారు. మాహిష్మతీ నగరం నుంచి పౌండ్రక, పులిందులు వచ్చారు. గోదావరీ తటాన వెదురు మదురుగా ఆవాసముంటున్న శబరు లంతా వచ్చారు.

శ్రీగిరుల నుంచి, విజయపురి, విజయవాటికల నుంచి, చేబ్రోలు, కొండపల్లి నుంచి, పజాం దిన్నెగా పేరెన్నిక గన్న అమరపురి నుంచి, జొన్నగిరి నుంచి, రామగిరి నుంచి సేనావాహినులు పొంగాయి. ఆంధ్రుల శక్తి శ్వేతగిరిలో సమీకృతమైంది.

నిశుంభుని వెన్ను తట్టి నిలిచింది.

రాజు ముందుగా రాయబారం పంపించాడు. శాంతి పిపాసుడు, శాంతి కాముకుడు అయిన ఒక మునిరాజు రాయబారం తెచ్చాడు!

"ఓయీ దానవరాజా! నిశుంభా! ఆ రాజు మాటలు వినవోయీ" అంటూ ప్రారంభించినాడు మునిరాజు.

"మౌనీ! దానవులంటే మానవులు కారని మీ అభిప్రాయమా?"

"మీరు రాక్షస జాతీయులు కదా!"

"అది రామాయణ కాలంనాటి మాట! ఇప్పుడు వీరంతా అయిదారు జాతులుగా విడిపోయినారు."

"ఆంధ్ర నాయకా! అతని మాటలు విను."

"అలా సంబోధించండి మునీ! వినేందుకు సిద్ధంగా వున్నాను."

"ఓయీ నిశుంభా! దానవ చక్రవర్తీ! ఆర్యావర్తంలో సుప్రసిద్ధుడను, యమునాతీర నివాసులైన ఆంధ్రు లందరినీ జయించి ఆంధ్ర విష్ణువుగా కీర్తి నామం ధరించినవాడను. దక్షిణాది ఆంధ్ర జాతులను జయించా లని వచ్చాను. నా రాయబారం విను.

యమునా తీరం వదలి మహానదిని దాటి దక్షిణా పథానికి వచ్చిన తరువాత ఎందరో చిన్న రాజులను జయించాను. నా ప్రధాన లక్ష్యం శ్వేతగిరులను




ఈ పుస్తకంను గురించి ప్రముఖుల అభిప్రాయాలు!

- జానపద కళలంటే ఎంతో మక్కువ గల నేను శ్రీ కోగంటి "పంటసిరి పాలపొంగు" చదివి ముగ్ధుడనయ్యాను! — లోకాయుక్త ఆవుల సాంబశివరావు
- కోగంటి కీర్తికి "పంటసిరి" "నృత్యం" "హిట్లర్ భాగవతం" పతాకాలు! — పద్మశ్రీ కళాప్రపూర్ణ డా॥ సి.నారాయణరెడ్డి
- ప్రజానాట్యమండలిలో స్త్రీ మిక్కిలినేని, కోగంటి, కర్నాటి త్రిమూర్తుల వలె జానపద నృత్యాలు, గీతాలు, బుర్రకథలు పాడి ఆడి జనంలో చైతన్యం కలిగించారు! — బాలాంత్రపు రజనీకాంతరావు, రిటైర్డ్ స్టేషన్ డైరెక్టర్, ఆకాశవాణి
- చక్కని గేయాన్ని కొన్ని నిముషాల్లో వ్రాసి చక్కని నృత్యాన్ని తయారు చేసి ఇవ్వగల సమర్థుడు, అర్జంటు కవి కోగంటి. — శ్రీమతి వి.కోటేశ్వరమ్మ M.A., B.Ed., Phd

దొరుకు చోట్లు:

నవోదయ పబ్లిషర్స్, విజయవాడ-2
నవభారత్ బుక్ హౌస్, విజయవాడ-2
నవజీవన్ బుక్ లింక్స్, విజయవాడ-2
విశాలాంధ్ర ప్రచురణాలయం వారి అన్ని బ్రాంచీలలోను లభించును!

ఎక్కువ కాపీలు కావలసిన వారు 'ప్రోగ్రెసివ్ ప్రెస్ ప్రైవేట్ లిమిటెడ్', విజయనగర కాలనీ హైదరాబాదు-500457 వారిని సంప్రదించండి! విడిప్రతి వెల: 25/- లు మాత్రమే!
త్వరలో... ప్రచురణ శ్రీ కోగంటి రచన ఆటపాట
Bommai

జయించడమే! అయితే ముందుగా రామగిరి, ఫణిగిరి, గాజులబండ వంటి మహానగరాలను జయించి తూర్పు సముద్ర తీరానికి రావాలనుకున్నాము. ఈలోగా నీ సైనికులు నా సైనికులను అవమానించారు. ఇది నీ రాజకీయ ఎత్తుగడ కావచ్చు.

నీకు ఏ దారుల నుంచి అయితే సహాయం అందుతుందో ముందు ఆ దారులను జయించవలసింది నేను. అలా చేస్తే నీవు బలహీనుడ వయిపోయి త్వరగా నా పాదాక్రాంతుడవు అయ్యేవాడివి.

కాని ముందుగానే వారందరిని నీ దగ్గరకు పిలిపించి, మా వారిని కవ్వించి నీ రాజనీతిజ్ఞతను నిరూపించుకున్నావు. అఖండ భారతావనిలో రెండవ స్థానం ఆక్రమించుకున్న ఆంధ్ర మహా సామ్రాజ్యాన్ని పాలించడానికి చాలినవాడవని ప్రకటించుకున్నావు. మంచిదే! మాకు కూడా ఇది మంచి అవకాశం!

ఊరూరా, పేరుపేరునా చిల్లర సామంతులందరినీ యుద్ధానికి ఆహ్వానించడం ప్రయాసతో కూడుకున్న పని. అది కాలహరణకి కారణమవుతుంది కదా! ఇలా అయితే మీ ఆంధ్రులందరినీ ఒకేసారి జయించి ఆంధ్ర విష్ణువు అన్న నామాన్ని శాశ్వత కాలాలకు స్థిరపరచుకుంటాను. యుద్ధంలో నీ ప్రజలు మూకుమ్మడిగా మరణిస్తారు.

నిర్యుద్ధంగా నాకు లొంగిపోతావా? ప్రాణాలను పణంగా ఒడ్డుతావా?'' అంటూ ఆంధ్ర విష్ణువు రాయబారాన్ని చదివి వినిపించాడు మౌని.

నిశుంభుడు పట పట పళ్ళు నూరాడు. అతని ముఖంలో మందారాలు పూచాయి. కళ్ళలో కింసుక వనాలు విరగబూచినాయి.

''ఇది రాయబారమా? లేక బెదిరింపా? తనకు తానే స్తోత్ర పాఠాలను వల్లించుకుంటున్నాడా మీ రాజు? ఆంధ్రులు పౌరుషంలో బెబ్బులులు. పరాక్రమంలో సింహాలు. వారిని జయించి శాశ్వత కాలాలకు ఆంధ్ర (జి)విష్ణువు అని పేరెన్నిక గన్నవారు ఎవరూ వుండడానికి వీలుకాదు. అది మా జాతికే తలవంపు.

అతని తలను ఖండించి నా వీరభద్ర కరవాలాన్ని తూర్పు సముద్ర జలాల్లో కడుగుతాను. అంతవరకు నేను అన్నం ముట్టను. పవిత్ర గౌతమీ సలిల ధారలతో స్నానం చేయను'' అంటూ వీరాలాపం చేశాడు నిశుంభుడు.

ఆంధ్ర సింహాలు ఆవులించి జూలు విదిల్చినాయి. కరుకుపెట్టిన కత్తులు దూకి గౌతమీ తీరానికి కదలి వచ్చాయి.

గౌతమీ తీరాన ఆర్యరాజు సేనలతో ఆంధ్ర సేనలు ఢీకొన్నాయి. రెండు మేఘాలు రాచుకున్నట్లుగా అయింది.

రెండు మదపుటేనుగులు మర్దించుకున్నట్లుగా అయింది. రెండు ఖడ్గ మృగాలు కొమ్ములతో కొరాడుకుంటున్నాయి. యుద్ధ విలయం నోరు విప్పింది.

మృత్యువు ద్వారాలను తెరచింది.

యుద్ధ భూతం కోరలలో చిక్కి ఎందరో సామాన్యులు బలి అయి ప్రాణాలను కోల్పోతున్నారు.




# దసరా వేషములు

ఒకడు పులివేష; మాంజనేయుండొకండు
రావణాసురుడొకడు — శూర్పణఖ యొకడు
గాగ దసరా వినోదముత్కట విధాన
విస్తరింతురు ప్రజలకు వేషగాండ్రు.

ఒక్క నాయకుండె యొక్కొక్క గడియకు
నొక్క వేషమూని యుత్తలంపు
హాస్యరసము చిలికి అలరించు రాజకీ
యంపు రంగమందు రంగుపులిమి

తెలుగు నదులందు సంగ్రామధీరవరుల
రక్తముప్పొంగి పారె, నిర్భరతనాడు.
నిరతమవినీతి కల్మషనియతమైన
స్వార్థ దుర్వాసనోదము పారునేడు.

కారు మొగిళుల చెండాడి నీరజారి,
పరచెడిని శరచ్చంద్రికా ప్రభలు భువిని.
రాజకీయంపు రొమ్మును ప్రబల జేసి
అంధకారమ్ము నింత్రునాయకులు పెరిగి.

రాజ్యకాంక్ష సంగ్రామముల్ ప్రబలజేసి
ప్రజల తెగటార్చి నారలు రాజులపుడు
మంచి మాటలతోడ వంచించి కుత్తు
కలనుకోయ సాగిరి నాయకులు నదేమొ?

శౌర్య ధైర్య పరాక్రమ సాహసములు
నాటి ధర్మ యుద్ధములందు నాటుకొనియె.
నేటి రాజకీయ ధర్మ నియతమైన
యుద్ధములయందు కులము ప్రసిద్ధి చెందు.

వట్టి వాగ్దాన శూరతల్ వట్టి పోయి
గట్టి కార్యంబులకు కల్గె గౌరవంబు
కార్యశీలికి నీనాడు గౌరవంబు
కల్ల వాగ్దాన శూరులే ఘటికులెందు.

—మొవ్వ వృషాద్రిపతి

బిడ్డలు కోల్పోయిన తల్లులు, భర్తలు చనిపోయిన భార్యలు, యుద్ధభూమి అశువు లర్పించిన దంపతులు!!

వృద్ధులు, స్త్రీలు, బాలురు, వ్యాధిగ్రస్తులు ఆంధ్రులందరూ నిశుంభుని వెనుక నిలిచి పోరాడుతున్నారు. ఆ రణస్థలి మృత్యువు క్రీడానృత్యానికి కేంద్రమయింది.

అదంతా చూచి నిశుంభుడు గుండె కోత పడగా కన్నీరు కార్చినాడు. ఎందుకీ ఊచకోత! ఎందుకీ నరమేధం? అలనాడు కురుక్షేత్రంలో వీర కంకణాలు ధరించి, వీర ఖడ్గాలు చేతబూని చివరిదాకా దుర్యోధన పక్షాన పోరాడినవాడు ఆంధ్రులకు మిగిలింది ఏమున్నది? మృత్యువు నీడలు! పరాజయం! ఆంధ్రులు ధర్మపథాన్ని విడిచి కౌరవ పక్షం చేరినారన్న అపప్రథ!

అంతకుముందే మనువు ఆంధ్రులను సామూహిక సంస్కారం లేని మూకలని, విశ్వామిత్రుని వల్ల శాప గ్రస్తులైన నిర్భాగ్యులని దూసిపోశాడు! ఋషులు గ్రంథాలలో చెండుకుతిన్నారు.

ఎంత కాలమీ ఆంధ్రులిలా మనుగడ సాగించాలి? ఒకవేళ ఈ యుద్ధంలో జయించినా యుద్ధోన్మాదులన్న పేరు రాకుండా వుంటుందా? ఇది కాదు దారి!! మరేమిటి!?

ఆలోచించి నిశుంభుడు ఒక నిర్ణయానికి వచ్చాడు.

''రాజేంద్రా! ఎందుకయ్యా ఈ విలయాన్ని సృష్టించావు? ఆంధ్ర జనగణాల మనఃకేదారాల్లో అగ్ని, అశాంతి రగిల్చినావు? అయిందేదో అయిపోయింది. ఈ నరమేధం ఇక చాలించాలి. యుద్ధం ఆపించాలి'' అన్నాడు.

''అయితే నీవు నా పాదాక్రాంతుడవు కాగలవా? ఆంధ్ర విష్ణువు అని మూడుసార్లు వల్లించగలవా?''

''అది అసాధ్యం రాజా! ఆంధ్ర సేనల ప్రతినిధిగా నేను పోరాడుతాను. ఆర్యసేనల ప్రతినిధిగా నీవు పోరాడు. నేను జయిస్తే ఆంధ్ర విష్ణువు అన్న కీర్తినామం నువ్వు ఒదులుకోవాలి. ఒకవేళ నేను ఓడిపోయి మరణిస్తే ఆ బిరుదు నామం నీకు మిగిలివున్నా నేను వినను కదా!''

''ఇందుకు నేను సిద్ధమే'' అంటూ భుజాలను అప్పళించాడు ఆంధ్ర విష్ణువు. ద్వంద్వ యుద్ధం ఆరంభమైంది.

సేనావాహినులు క్రిక్కిరిసి చూస్తున్నాయి.

మూడు దివారాత్రుల యుద్ధం జరిగింది.

నిశుంభుని తల తెగిపోయింది.

''జై వీరభద్రా!'' అంటూ అతని తల గోదావరీ జలరాసులలో కలిసి అంతర్లీనమయింది.

ఆర్య సేనలు వరదలా పొంగాయి. ఆంధ్ర సేనలు అనామకమై కృంగిపోతున్నాయి.

''ఆంధ్ర విష్ణూ జయహో!'' అన్న నినాదం మిన్ను ముట్టింది.

''ఆంధ్ర విష్ణువుకు స్వాగతం'' అందామె విజయగర్వంతో!!

''నీవు కూడా ఆ పేరుతో పిలుస్తున్నావా?'' అంటూ ప్రియురాలి అధరాంను అందుకున్నాడు ఆంధ్ర విష్ణువు.